# కాముడు కాలిపోయాడు

ఒక్కసారిగా నిలువెత్తున లేచిన మంటలో చీకటి కాలిపోయింది. ఆ మంటలో కాముడు మండిపోతున్నాడు. కిటికీలోంచి గదిలోకి వెలుతురు వాలుతోంది. గది గోడలమీద చీకటి వెలుగులు అలలు అలలుగా కదలుతున్నాయి. పిల్లలు బయట అరుస్తున్నారు. కాలిపోతున్న కాముడ్ని చూసి సంతోషంతో ఏడుస్తున్నారు!

గదిలో మంచంమీదనుండి కలలోకి తొంగిచూస్తోన్న ఫణీంద్రుడికి తెలివి వొచ్చేసింది. నిద్ర తేలిపోయింది. లేచి కిటికీ వద్దకు వెళ్ళాడు. వీధిలో, కిటికీకి కాస్త ఆవల మంటచుట్టూ పిల్లలు గెంతుతున్నారు. నిర్దాక్షిణ్యంగా కాలిపోతున్న బెల్లంబుట్టలోని చీమలు చిటపటమంటున్నాయి.

అతనికి చిన్నప్పటి భోగిమంట జ్ఞాపకాని కొచ్చింది. వాళ్ళ వీధిలో లోకేశ్వరి యింటిముందు భోగిమంట వేసేవారు. పిల్లలంతా బూడిద మిగిలేవరకు ఆ మంటను వదలేవారుకాదు. లోకేశ్వరి అందరిమీదా అధికారం చెలాయించేది. ఎవరు మంటదగ్గర కూర్చోవాలో, ఎవరు కూర్చో

కూడా లోకేశ్వరే నిర్ణయించేది. డబ్బున్నవాళ్ళ అమ్మాయి ఆమె. అంతా ఆమె చెప్పినట్లే వినేవారు.

ఒకనాడు ఆమె ఫణీంద్రుడ్నీ, మరో యిద్దరబ్బాయిల్నీ మంట దగ్గరకు రానివ్వలేదు. అందుకు అట్టే కారణంకూడా లేదు. భోగిదండ ఎవరు పెద్దది కట్టుకుంటారోనని వాళ్ళలో వాళ్ళు పంతాలు వేసుకున్నారు. లోకేశ్వరి, వాళ్ళ పాలేరుచేత పొలంలో భోగి పిడకలు పెట్టించింది. ఎండి పోయిన తర్వాత వాటిని ఎవరో దొంగిలించేశారు. లోకేశ్వరి మళ్ళీ పెట్టించింది. ఈసారికూడా అలానే పోయాయి. మొత్తంమీద ఆమె పెద్ద దండ కట్టుకోలేక పోయింది. ఆ సంవత్సరం ఫణీంద్రుడి దండ పెద్దదని అంతా ఒప్పుకున్నారు. ఆమెకూడా ఒప్పుకోక తప్పలేదు అసలు ఆ పిడ కలు ఫణీంద్రుడే దొంగిలించాడని ఆమె అనుమానం.

అందుకని ఆమె ఫణీంద్రుడ్ని మంట దగ్గరకు రానివ్వలేదు.

ఫణీంద్రుడికి చాలా కోసం వచ్చింది. నిజానికి ఆ భోగిమంటలోని సగం దుంగలు అతనే లాక్కొచ్చాడు. స్కూలు విడిచిపెట్టగానే పది మంది పిల్లల్నీ వెంటబెట్టుకుని పొలాల్లోనూ, తోపుల్లోనూ తిరిగి తాటి దుంగలూ, తుమ్మ తుప్పా లాక్కొచ్చాడు. ఒకసారి ఈతముల్లు పాదంలో దిగబడిపోయి నాలుగురోజులు నడవనియ్యనేలేదు!

లోకేశ్వరి వద్దంటున్నా వినకుండా తెగించి ముందుకు వచ్చాడు ఫణీంద్రుడు. లోకేశ్వరి అడ్డంగా నిలబడి రెండుచేతుల్నీ బాణాల్లా నడుం మీద వేసుకుని 'ఎలా వస్తావో, రా, చూద్దాం' అన్నట్టు చూసింది.

ఫణీంద్రుడు ఒక్క తోపు తోశాడు.

ఆమె తమాయించుకుని దగ్గరకొచ్చి అతని చొక్కా కాలరు పట్టు కుంది.

అతను విదిలించుకున్నాడు.

ఆమె పట్టు వదల్లేదు. దూరంగా నెట్టింది.

ఆ నెట్టడంలో అతను తూలి మంటమీద పడ్డాడు మణికట్టుకు ఎగువ ఎడంచేతిపైన కొద్దిగా కాలింది వారం రోజులపాటు అతను లోకేశ్వరితో మాట్లాడలేదు.

అప్రయత్నంగా ఫణీంద్రుడు ఓ నిట్టూర్పు విడిచాడు. కిటికీ ఊచల్ని పట్టుకున్న అతని చేతిమీద, కాలిపోయిన మచ్చ వెక్కిరించింది.

ఇప్పు డతనికి మిగిలింది ఆ మచ్చే.

ఎవరి కంఠమో అతడిని ఆలోచనల్నుంచి లేపింది.

అటు చూశాడు.

ఎదుటింటి గుమ్మంలో భగవతి ఎవరో పిల్లవాడ్ని కేకలేస్తోంది. మరీ విశాలమైన వీధి కాదది. ఓమాదిరి సందు. సరిగ్గా ఎదుటి ఇల్లే ఆమెది.

నిద్రలేచి వచ్చినట్టుంది, భగవతి కళ్ళల్లోకి జుట్టు జారుతోంది. కుడిచెవి దద్దులోని ఎర్రరాయి క్షణంసేపు తోకచుక్కలాంటి కిరణాన్ని కిందకు వదిలింది. పసుప్పచ్చని ఓణీమడతల్లో చీకటి వెలుగులు దోబూచులాడుకొంటున్నాయి. తెల్లని ఆమె ముఖంమీద ఎర్రని మంట గులాబీ రంగును నింపుతోంది.

భగవతి కిటికీవయిపు చూసింది. కళ్ళ రెప్పల్ని టపటపా కొట్టుకుని చూపుల్ని కిందకు దించుకుంది. సిగ్గుబారిన ఆమె బుగ్గల్లో చీకటి కాటుక పెట్టింది.

ఫణీంద్రుడు భగవతినే చూస్తూ నుంచున్నాడు.

అతనికి లోకేశ్వరి జ్ఞాపకానికి వచ్చింది.

లోకేశ్వరి అచ్చంగా భగవతిలా వుండకపోయినా ఆమెలాగే లోకేశ్వరికూడా కళ్ళను టపటపలాడించేది. పొడవైన, సన్నటి

ముఖంలో విశాలమైన కళ్ళు ఆ లోపలి పాపల అల్లర్లను బైటపెడుతుంటాయి. అలా కళ్ళతో నవ్వేవాళ్ళంటే అతనికి యిష్టం. ఒక విషయం అతనికి చాలా విచిత్రం అనిపిస్తుంది. భగవతిని చూసినప్పుడల్లా లోకేశ్వరి జ్ఞాపకాని కొస్తుందికాని, లోకేశ్వరిని చూస్తే భగవతి మాత్రం జ్ఞాపకానికి రాదు. అదేమిటో మరి!

ఫణీంద్రుడు మరోసారి ఎదుటింటివైపు చూశాడు.

భగవతి యింకా అలానే నిలబడి వుంది. చూపులు విసిరి నవ్వుతోంది. ఎదుటి మంట యిందాకటంత ఉధృతంగా లేదు. ఎవరో బలవంతంగా జ్వాలల్ని అణిచేస్తున్నట్టు కిందకు దిగిపోతోంది. పిల్లలు చింకిచాపలూ, బుట్టలూ ఏరుకొచ్చి మంటను నిలబెడుతున్నారు.

భగవతి లోపలికెళ్ళి కట్టెపేళ్ళు తెచ్చి మంటలో వేసింది. తిరిగి మంట నిలువెత్తున లేచింది. ఆనందంతో ఆమె కిటికీవైపు చూసింది.

ఫణీంద్రుడు చూశాడు. ఆమె ముఖంలోని చిరునవ్వునూ, కళ్ళలోని కాంతినీ అతను ఏరుకుని దాచేసుకున్నాడు. తిరిగివెళ్ళి పడుకున్నాడు.

నిద్ర రావడంలేదు. ఎప్పుడో అది తేలిపోయింది. ఇప్పుడతన్ని ఆలోచనలు తేల్చివేస్తున్నాయి.

భగవతి అందమైన అమ్మాయి. తనంత తానుగా, సన్నిహితంగా రావాలని ప్రయత్నిస్తోంది. ఆమె అంటే తనకు యిష్టమే. ఆమెను తను ఎందుకు దూరంగా వుంచివేస్తున్నాడా అని ఆలోచించినపుడు తగిన సమాధానమేమీ అతనికి లభించలేదు.

లోకేశ్వరి ఆలోచనలతో మనసు వికలమై వేరే యింట్లోకి మారిపోదామని ప్రయత్నం చేసినప్పుడు ఆ ప్రయత్నంలోనే భగవతి తొలిసారి కనిపించింది. అద్దెకు గది కాళీవున్నట్టు ఆ అమ్మాయే చెప్పింది.

ఫణీంద్రుడు గదిని గురించి వెతుక్కుంటూ వస్తూ ఓ యింటి

ముందు ఆగిపోయి, గుమ్మంలో వున్న ముసలాయన్ని "ఇక్కడెక్కడయినా అద్దెకు గది దొరుకుతుందా" అని అడిగాడు.

ఆయనకు బ్రహ్మ చెముడు. రెండుసార్లు చెప్పినా వినిపించినట్టు లేదు. ఈ శబ్దానికి భగవతి లోపలినుంచి వచ్చింది. అదే ప్రశ్న ఆమెనూ అడిగాడు. ఆ ఎదుటిల్లు చూపించి 'అక్కడకు వెళ్ళి అడగండి' అంది.

ఆ మరుసటిరోజు అతను ఆ గదిలో దిగడం ఆమె చూసింది. ఆ సాయంకాలం సంధ్యవాలిపోయిన తర్వాత ఎప్పుడూలేని మురళీరవాన్ని ఆమె వింది. అది ఎక్కడినించి వచ్చిందో ఊహించడం ఆమెకు కష్టమనిపించలేదు.

ఆ మురళీరవంతోనే అతను ఆమెకు సన్నిహితమయిపోయాడు. అతని పొడుగాటి వ్రేళ్లు, చింపిరిగా ఎగిరిపడుతుండే జుట్టు, ముతక ఖద్దరు లాల్చీ, పైజామా, సగం అరిగిన ఆకుజోళ్ళూ ఆమెకు చాలా అందంగానే కనిపించేవి. వాటన్నిటితో ఆ వ్యక్తిని తరచు చూడాలనీ, చూస్తూ వుండిపోవాలనీ ఆమెకు అనిపించేది.

అంతంత మాత్రంగానైనా ఎప్పుడూ ఆమె అతనితో మాట్లాడలేదు___రెండు మూడుసార్లు తప్ప. అలాంటి అవకాశాన్ని అతనెప్పుడూ కల్పించేవాడుకాదు. చిలిపిగా ఆమె చేసే అల్లరిని నిశ్చలంగా చూసి వెళ్ళిపోతుండేవాడు. ఒక్కొక్కప్పుడు ఆమెకు సహనం కూడా సన్నగిల్లిపోతుండేది. అభిమానంతో, కోపంతో యిక అతనివైపు చూడగూడదనుకునేది. కాని, అతని మురళీనాదాన్ని వింటే రాధికలాగా అయిపోతుంది. సముద్ర గర్భం ఎంత ప్రశాంతంగా వున్నా ఒక్కొక్కప్పుడు ఆ ప్రశాంతతతో విసిగిపోయి కోటానుకోట్ల బాహువుల్ని ఆకాశంలోకి సాచి 'ఈ నిశ్చలతను యిక భరించలేను ప్రభూ' అని విలపించినట్టే, అంత గంభీరమైన అతనూ ఎప్పుడో ఒకప్పుడు ఆ గాంభీర్యాన్ని భరించలేక తనను చూసి చిరునవ్వు విసరకపోతాడా అని ఆమె ఆశ.

తనకై యింతగా పరితపిస్తోన్న భగవతిని చూస్తే ఫణీంద్రుడికి జాలేసింది. తన ఉనికి తెలియడంతోనే గుమ్మంలోకొచ్చి నుంచుని, చూపుల్తోనే తృప్తిపడే ఆమెను అనవసరంగా యిక బాధపెట్టదలచుకోలేదు. ఇంతకాలంగా ఏ విషయాన్ని గురించి బాధపడ్డాడో ఆ విషయాన్ని ఆమెకు తెలియజేయాలని అనుకున్నాడు. తన గత జీవితాన్ని ఆమె భరించలేదేమోనని అతని భయం.

ఏమయినా యిక ఆమెను బాధ పెట్టగూడదు—అనుకున్నాడు.

ఆ నిర్ణయం చేసుకున్న తర్వాత అతని మనసు ఎప్పుడూ లేనంత తేలిగ్గా అయిపోయింది. లోకేశ్వరి తన హృదయంలో నింపిన బరువుకూడా తొలగిపోయినట్టనిపించింది.

ఆ తర్వాత లోకేశ్వరి గురించి మరో పది నిమిషాలు ఆలోచించాడు. పూర్వంలాగా అతని ఆలోచనల్లో యిప్పుడు స్వార్థంలేదు. బాధలేదు.

'రేపే లోకేశ్వరి పెళ్ళి' అని జ్ఞాపకం చేసుకున్నాడు. హాయిగా నిద్రపోయాడు.

నిద్ర లేవగానే రంగుల్ని పులుముకున్న ఉదయం అందంగా కనిపించింది. ఎక్కడబడితే అక్కడ రంగులు ఎగురుతున్నాయి. ఊరంతా రంగుల్లో మునిగి చిన్నపిల్లలా ఆడుకుంటోంది.

ఆ రోజు హోళి!

రాత్రి కలలో జల్లిన వసంతం స్మృతి యింకా అతని మనసులో రంగుల్ని కోల్పోలేదు. మత్తుగా లేచి కిటికీవద్దకు వెళ్ళాడు. బయట పిల్లలు ఒకరిమీద ఒకరు వసంతం జల్లుకొంటున్నారు. ముఖాలకు రంగులు పులుముకొంటున్నారు. అరుగుమీద నుంచుని భగవతి ఇంద్రధనుస్సులోని మెరుపులాగ నవ్వుతోంది.

కొద్దిసేపు ఆలోచనలకు రంగులు పులుముతూ నుంచున్నాడు

అతను. అప్రయత్నంగానే అతని పెదవులమీదనుండి చిరునవ్వు దొర్లి పోయింది. ఆ చిరునవ్వును ఏరుకుని భగవతి యింట్లోకి వెళ్ళిపోయింది.

అతను గబగబా కాలకృత్యాల్ని ముగించుకున్నాడు. మరో రెండు గంటల్లో పసుపుబట్టల్లో లోకేశ్వరిని చూడబోతున్నాడు. పెళ్ళికూతురై పెళ్ళి పీటలమీద కూర్చుని తనకై ఎదురుచూస్తూ వుంటుంది ఆమె. ఆమె జీవితాన్నీ, ఆమెనూ పంచుకోబోయే వ్యక్తి కూడా తనను అక్కడ చూస్తేనే గాని తృప్తిపడదు.

అందుకే అతను గబగబా అన్ని పనుల్నీ పూర్తి చేసుకున్నాడు. ఆ ముందు రోజు ఉతికి యిస్త్రీ చేయించుకున్న బట్టలు తొడుక్కున్నాడు. ఆమెకని కొన్న పుస్తకంలో అందంగా కొన్ని లైనులు రాశాడు. మూడు నాలుగుసార్లు చదువుకుని తృప్తిగా వూపిరి తీశాడు.

ముహూర్తానికి యింకా గంట టయిముంది. మరో అరగంటకు బయలుదేరితే సరిగ్గా పెళ్ళి పీటలమీదనుండి లోకేశ్వరి తనను చూడొచ్చు. వంచిన ముఖంలోని చెమర్చిన ఆమె కళ్ళను మరొకరు చూసే అవకాశం అప్పుడు వుండదు.

ఫణీంద్రుడు పుస్తకం తెరచి మొదటి పేజీల్లో తను రాసిన వ్యాక్యాల్ని మరోసారి చదువుకున్నాడు.

ఆ వాక్యాల్లో తనను లోకేశ్వరి చూడగలదనే అతని నమ్మకం. తనను ఆమె అపార్థం చేసుకుంటోంది. అలా చేసుకోవడం ఆమె తప్పేమీ కాదు. ప్రయత్న పూర్వకంగా తను ఆమెను దూరం చేసుకుంటున్న యీ చర్య వెనుక ఎంత బలమైన కారణమున్నదీ ఆలోచిస్తే తన అశక్తతను ఆమె మన్నించగలదని అతని అభిప్రాయం. లోకేశ్వరి ప్రేమను తను తిరస్కరించి దురదృష్టవంతుడే అవుతున్నాడు. ఆ విషయం ఆమె ఎదుట వప్పుకోవడానికి అతనికి సిగ్గేమీలేదు.

ఒకరోజు అతను ఆమె కన్నీళ్ళలో స్నానం చేశాడు. ఆ కన్నీళ్లు అతడిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అతని మనసంతా అదోలా అయి

పోయింది. ఆమె హృదయాన్ని గాయపర్చినందుకు ఆమెను క్షమాపణ వేడుకున్నాడు గాని ఆమె దేవత కాలేకపోయింది. ఏడుస్తూనే వెళ్ళి పోయింది.

ఆమె ఆశల్ని అతనెప్పుడూ కూల్చివేయదలచుకోలేదు. 'నీకు నేనంటే యిష్టమేనా?' అని తొలిసారి ఆమె అడిగినప్పుడే ఆమెలో అతనికి వింత కాంతి కనిపించింది. అంతస్థుల తారతమ్యాల్ని అధిగమించిన ఆమెను ఒక దేవతగానే భావించాడు. చిన్నప్పటి వల్లెటూరిలోని లంగా జాకెట్టు లోకేశ్వరికీ, ఈ నాటి పట్నంలో లోకేశ్వరికీ ఎంత భేదం వుందో ఆలోచించినప్పుడు అతనికి ఆశ్చర్యం వేసింది. ఆమెను దూరం చేసుకో దలచుకోలేదు అతను.

కాని__

ఈనాడు తనంత తానుగానే ఆమెను దూరం చేసుకోక తప్పలేదు. ఇంతకాలం తన చదువుకు అజ్ఞాతంగా సహాయం చేస్తోన్న వ్యక్తి ఆమె మేనమామే అనీ, అతనికిచ్చి ఆమెను పెళ్ళి చేయాలని వాళ్ళింట్లో అనుకుంటున్నారనీ విన్నప్పుడు కొయ్యబొమ్మలా స్తబ్దైపోయాడు. అనాడే, తను దురదృష్టవంతుడననే విషయం అతనికి అర్థమయ్యింది.

తనకు సహాయంచేసిన వ్యక్తికి, తన అభివృద్ధికి కారకుడైన వ్యక్తికి కృతఘ్నుడుగా చిరకాలం జ్ఞాపకం వుండదలచుకోలేదు. బండెడు దుఃఖాన్నీ భరించడానికే నిశ్చయించుకున్నాడు.

ఆ తర్వాత ఆమె కలిసినప్పుడు__

"లోకేశ్వరీ ! నిన్ను నేను పెళ్ళి చేసుకోలేను, క్షమించు" అన్నాడు.

ఆమె గతుక్కుమంది. విచిత్రంగా అతని కళ్ళల్లోకి చూస్తూ దగ్గరకు వచ్చి నుంచుంది.

"నేను దురదృష్టవంతుడ్ని లోకేశ్వరీ. నీలాంటి ఆమెను చేతులారా దూరం చేసుకుంటున్న అదృష్టహీనుడ్ని. నా నిర్ణయం నీ హృదయాన్ని గాయపరుస్తుందని నాకు తెలుసు. కాని అసహాయుడ్ని. ఏమీ చేయలేను, క్షమించు" అన్నాడు.

లోకేశ్వరి క్షమించకుండానే వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఆమెను కలవడానికి అతను ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. రెండు మూడుసార్లు ఆమె ఎదురయినపుడు, దూరంనుంచే ఆమెను చూసి, ఆమెకు కనబడకుండా తప్పుకునేవాడు. తననుచూస్తే పాత జ్ఞాపకాలతో ఆమె బాధపడుతుందని అతని భయం.

చాలా రోజులతర్వాత ఒకరోజు లోకేశ్వరి అతని గదికి వచ్చింది.

"ఫణీ! నన్ను చూసి అలా పారిపోవడం చాలా బాధగా వుంది నాకు. కనుపించినప్పుడయినా పలకరించి మాట్లాడకపోవడం మంచి పని అనలేను. అంతలా నన్ను చూసి భయపడవలసినదేమిటో నాకు అర్థం కావటంలేదు" అంది.

దానికతను సమాధానం చెప్పలేకపోయాడు.

ఆమె చాలా సేపు అలానే కూర్చుండిపోయింది. వెళ్ళిపోయేముందు పుస్తకంలోంచి శుభలేఖ ఒకటి తీసిచ్చి "ఆశలు కూలిపోయినా అభిమానం విరిగిపోలేదు. నన్ను నువ్వు దూరం చేసుకున్నా నిన్నెప్పుడూ నేను దూరం చేసుకోలేను. నీమీద నాకు కోపం వుండడం సహజంగాని నామీద నీకు కోపం వుండడంలో అర్థంలేదు. నన్నెంతగా అసహ్యించుకున్నా కనీసం నా వివాహానికయినా రావడానికి ప్రయత్నించు. అల్ప సంతోషిని. అంతకన్నా ఎక్కువ నేనేమీ కోరను" అంది.

మరోసారి అతను ఆమె కళ్ళలో స్నానంచేశాడు. ఎక్కువసేపు అతన్ని కన్నీళ్ళలో తడపడం ఆమెకు యిష్టంలేక, వెంటనే అక్కడనుంచి కదలి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతోన్న లోకేశ్వరితో "లేదు లోకేశ్వరీ! నువ్వంటే నాకు ఏమాత్రం కోపంగానీ, ద్వేషంగానీ లేవు. నిన్ను నేనెప్పుడూ అసహ్యంచుకోలేదు. ఎప్పుడూ ప్రేమిస్తూనే వుంటాను. తప్పకుండా వచ్చి, నీ వివాహాన్ని కళ్ళారాచూసి, నీ అదృష్టానికి మురిసి నీకు నా అభినందనల్ని అందజేస్తాను—" అన్నాడు.

అప్పటికే ఆమె వీధిలోకి వెళ్ళిపోయింది.

ఫణీంద్రుడి ఆలోచనలు విచ్చిపోయాయి. ఇంటివాళ్ళ గడియారం నిశ్శబ్దంలో భయంకరంగా శబ్దం చేసింది.

అదిరిపడి చూశాడు ఫణీంద్రుడు.

ఆలోచనలతో అసలు సంగతే మరిచిపోయాడు. ఈపాటికి లోకేశ్వరి పెళ్ళి పీటలమీద కూర్చుంటుంది. ఆమె చూపులు నాలుగు మూలల్లోకీ పరుగెత్తుతుంటాయి. అవి నిరాశను నింపుకోకుండానే తను అక్కడకు చేరుకోవాలి.

గదికి తాళంవేశాడు. మెట్లమీదనుంచి వీధిలోకి చూశాడు. ఎదురింటి గుమ్మంలో క్షణంపాటు మెరుపులా మెరిసి మాయమయ్యింది భగవతి. రంగులు నింపిన ముఖంలోంచి సన్నగా నవ్వింది. ఇంద్రధనుస్సు లాంటి ఆ నవ్వు అతని హృదయంలో రంగుల్ని వెదజల్లింది.

ఫణీంద్రుడు క్షణంసేపు అలానే నిలుచుని మెట్లుదిగి వీధిలో కొచ్చాడు. గబగబా రెండడుగులు వేశాడు. అంతలో—

అకస్మాత్తుగా అతనిమీద రంగులు వచ్చిపడ్డాయి. భగవతి గుమ్మంలో నిలబడి రెండు చేతుల్లోనూ రెండు రంగునీళ్ళ సీసాల్ని పట్టుకుని పకపకా నవ్వుతోంది.

ఫణీంద్రుడు ఆగిపోయాడు. ఒకసారి తన బట్టలవైపు చూసుకున్నాడు. బట్టలు రంగుల్లో వెక్కిరిస్తున్నాయి. పుస్తకంమీద రంగులు గజిబిజిగా అలుక్కుపోయాయి.

అతనికి కళ్ళ నీళ్లు తిరిగాయి. కొద్దిసేపు అలాగే నిలబడిపోయి ఆమె ముఖంలోకి చూశాడు. ఇంకా అలానే నవ్వుతోంది ఆమె.

ఫణీంద్రుడు యిక అక్కడనుంచి ముందుకు కదలలేకపోయాడు. వెనక్కి తిరిగొచ్చి తలుపులు తీసుకుని కుర్చీలో కూలబడ్డాడు.

ఆలోచిస్తున్న కొద్దీ అతని కళ్లు కన్నీటితో నిండిపోతున్నాయి. అతనికి వున్నవి రెండే రెండు జతలు. ఆ ముందటి రోజునే ఒక జత బట్టల్ని తెల్లగా ఉతుక్కొని, యిస్త్రీ చేయించి యివ్వాల్టికనే దాచుకున్నాడు. ముగ్గురు మిత్రుల్ని కాళ్ళా వేళ్ళా బ్రతిమిలాడి యిరవై రూపాయల్ని సంపాదించాడు. దాంతో నాట్యశాస్త్రం మీద పుస్తకం ఒకటి కొన్నాడు. పెళ్ళినాడు ఆమెకిచ్చే కానుక అది. ఆమెకు నాట్యమంటే చాలా యిష్టం. అంతకుముందు కొంతకాలంపాటు ఆమె నేర్చుకుంది. వివాహానంతరం అది మూల పడిపోకూడదని అతనా పుస్తం కొని ఆమెకు బహూమతి చేస్తున్నాడు.

తాహతుకు మించిచేసిన యింత ప్రయత్నమూ క్షణంలో వృధా అయిపోయింది. తను ఆమెను అసహ్యించుకోవడంలేదనీ, ఎప్పటికీ ఆమెను ప్రేమిస్తూనే వుంటాడనీ నిరూపించుకునే అవకాశం అతనికి యిక లేదు. అక్కడ పెళ్ళి పందిట్లో లోకేశ్వరి కళ్లు యీపాటికి చూసిచూసి అలసిపోయి శోషవచ్చినట్టు వాలిపోతాయి.

అతనికి దుఃఖం పొర్లుకొచ్చేస్తోంది. పెదాల్ని గట్టిగా పంటితో అదిమి పట్టుకుని బలవంతంగా ఆపుకుంటూ కిటికీలోంచి అవతలకు చూశాడు. భగవతి యింకా అక్కడే నిలుచుని సన్నగా నవ్వుతోంది.

ఫణీంద్రుడు మెల్లగా లేచాడు. తెల్లకాగితం ఒకటి వెతికి తీసుకొచ్చాడు. దానిమీద పెన్సిలుతో చిన్న సున్నా చుట్టి, మధ్యన కళ్ళు

ముక్కూ, నోరూ అవీ గీశాడు. అడుగున పెద్ద సున్నా గీశాడు. దానికి కింద, అటూ యిటూ కాళ్లూ చేతుల్లా గీతలు గీశాడు. పొట్టలో నల్లగా కొట్టొచ్చినట్టు కనపడేటంత పెద్ద పెద్ద అక్షరాలతో "కాముడు" అని రాశాడు. గుమ్మంలో నుంచున్న భగవతికి ఆ బొమ్మ చూపించాడు. అగ్గిపుల్ల వెలిగించి దానికి ఒక చివర అంటించాడు. ఆ మంట భగభగామండి దాన్ని కాల్చివేసింది. మిగిలిపోయిన నల్లని బూడిద గాలిలోఎగిరిపోయింది.

నవ్వుతూ చూస్తోన్న భగవతి కళ్ళు ముడుచుకుపోయాయి. ఆమె ముఖంలోని ఇంద్రధనుస్సు పాలిపోయింది.

* * *